

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ అధికారులు తో టెలికాన్ఫరెన్సు నిర్వహించి ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియచేయాలని అధికారులకు సూచించారు. ఈ టెలికాన్ఫరెన్సులో జేసి అభిషేక్ కుమార్, ఆర్డీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని, టామ్ టామ్ లేదా మైకుల ద్వారా (పబ్లిక్ అడ్రస్ సిస్టం) ద్వారా ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాలని ఆదేశించారు. అధికారులు అందరూ జిల్లా కేంద్రం, వారు పనిచేసే స్థానంలోనే అందుబాటులో ఉండాలన్నారు. 24 గంటలు పని చేసేలా జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని.. భారీవర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని కంట్రోల్ రూమ్ నెంబర్ 08555289039కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

దంచికొట్టిన వాన

ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

పలుచోట్ల తెగిన రోడ్లు , కల్వర్టులు

రాకపోకలకు అంతరాయం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వానలు పడుతున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసాయి. తాడిపత్రి ప్రాంతంలో అత్యధికంగా వర్షపాతం నమోదయింది. తాడిపత్రి నంద్యాల మార్గంలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో వంక పొంగిపొర్లడంతో రహదారి కొట్టుకుపోయింది. తాడిపత్రి ప్రాంతంలోనే ఓబులేసు కోన, యాడికి మండలంలో కోన ఉప్పలపాడు ప్రాంతంలో జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. గడిచిన నాలుగైదు రోజులుగా జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఆదివారం నాడు తాడిపత్రి మండలంలో అత్యధికంగా 72.2 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. నార్పలలో 66.4, పుట్లూరులో 58.8 , యల్లనూరులో 56.8, శెట్టూరులో 55.8, అత్యల్పంగా వజ్రకరూరులో 1.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లా మొత్తంగా ఆదివారం నాడు 106.5 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. సత్యసాయి జిల్లాలోనూ అత్యధికంగా వర్షాలు పడుతున్నాయి. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లిలో వంకలు పెద్ద ఎత్తున పొంగడంతో రహదారి. కల్వర్టులు దెబ్బతిన్నాయి. దీంతో ఐదు గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ప్రజాశక్తి యంత్రాంగం

తాడిపత్రిలో వర్ష బీభత్సం

శనివారం రాత్రి కురిసిన ఏకదాటి వర్షానికి తాడిపత్రి మండల పరిధిలోని వాగులు వంకలు నిండి పొంగిపొర్లాయి.కొన్ని రహదారులు తెగిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా గ్రావెల్‌తో నిండిన కొండగుట్టలు విరిగిపడ్డాయి. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఆదివారం పెన్నా నదికి నీరు వచ్చి పరవళ్లుతొక్కుతోంది. మండలంలోని వంకలు, వాగులు నిండి గ్రామాలకు వెళ్లే దారులు మూసుకుపోయాయి. ప్రధానంగా తాడిపత్రి నంద్యాల ప్రధాన రహదారిపై బుగ్గ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న 544 – డి హైవే బ్రిడ్జ్ పనులు జరుగుతుండగా అక్కడ సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే అక్కడి వంకకు పెద్ద ఎత్తున నీరు చేరుకోవడంతో వేసిన సర్వీస్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో తాడిపత్రి – నంద్యాల ప్రధాన రహదారి పై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి రాకపోకలు స్తంభించాయి. అటు బనగానపల్లె, నంద్యాల, కోవెలకుంట్ల వైపు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలా దాదాపు తెల్లవారుజామున సుమారు మూడు గంటల నుంచి నిలిచిపోయిన వాహనాలు ఉదయం 10:00 అయినప్పటికీ అక్కడే ఉండిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా తాడిపత్రి నుండి ఓబులేసుకోన, ఊరు చింతల వెళ్లే మార్గంలో ఆవుల తిప్పయి పల్లి గ్రామం వద్ద వంకకు నీరు అధికంగా చేరడంతో ఆ దారిలో వెళ్తున్న ఓ జీపు నీటి ఉధృతికి అటువైపు వెళ్లలేకపోయింది దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వాహనం దిగి పక్కకు రాగా జీపు వంకలో కొట్టుకుపోయింది. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అదేవిధంగా మండల పరిధిలోనిఆలూరు కోన నందు అక్కడున్న గ్రావెల్ మట్టి వర్షపు నీటికి కరిగి కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో గ్రావెల్ మట్టి కింద పార్కు చేసి ఉన్న వాహనాలకు మట్టి పేరుకుపోయింది. అలాగే అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ సమీపంలో ఉన్న దేవరకోనకు వర్షపు నీరు అధికంగా రావటంతో అక్కడ జలపాతం ఉధృతంగా మారింది. రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని చిన్న పెద్ద వంకలు వాగులు నీటితో నిండిపోయాయి.

ధర్మవరం డివిజనలో భారీ వర్షం

ధర్మవరం రెవిన్యూ డివిజన్‌లో నాలుగు రోజులు నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ధర్మవరం మండలంలో 34.6 మిల్లీమీటర్లు, బత్తలపల్లి మండలంలో 36.2, తాడిమర్రిలో 47.2, ముదిగుబ్బలో 32.2, కనగానపల్లిలో 10.2, సి కే పల్లి లో 42.6, రామగిరి మండలంలో 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. డివిజన్ మొత్తంగా 205.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. ధర్మవరం మండల పరిధిలో కురిసిన భారీ వర్షాలకి పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నది ఆదివారం ఉదయం పొంగి ప్రవహించింది. ఈ ప్రవాహం వలన ధర్మవరం చెరువుకి భారీగా నీరు చేరుతోంది.

విరిగిపడిన కొండ చరియలు

ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి తాడిమర్రి మండలం దాడి తోట పులివెందుల ప్రధాన రహదారిపై గల పులుట్ల కనుమ వద్ద కొండ చరియలు ఒక్కసారిగా ప్రధాన రహదారిపై విరిగిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



తాడిపత్రి మండలంలోని బుగ్గ సమీపంలో తెగిపోయిన సర్వీసురోడ్డు

దెబ్బతిన్న గంగినేపల్లి బ్రిడ్జి

శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లి బ్రిడ్జి దెబ్బతింది. దీంతో గంగినేపల్లి, ఎర్రోనిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలతో పాటు ఎస్టీ కాలనీల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

యల్లనూరులో భారీ వర్షం

శనివారం రాత్రి యల్లనూరు మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి.అలాగే ఎగువ ప్రాంతం లో కురిసిన వర్షాలకు చిత్రావతి నది ప్రవహిస్తోంది.

కొత్త చెరువులో భారీ వర్షం

శనివారం రాత్రి భారీ వర్షం రావడంతో వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. రాత్రి కురిసిన వర్షం జిల్లాలోనే అత్యధిక 76.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

గాలివానకు నేలకొరిగిన అరటి పంట

:కంబదూరు మండలం రాంపురం గ్రామంలో కమ్మ వెంకటేశులకు సంబంధించిన నాలుగు ఎకరాల అరటిపంట గాలివానకు నేలపాలైంది.

జలమయమైన రోడ్లు : నార్పల లో ఆదివారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయంగా మారి వంకలను తలపించాయి అదేవిధంగా మండల పరిధిలోని కురుగానపల్లి, కేశేపల్లి, నడిమిదొడ్డి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.ముగేత్తెంపల్లిలో చెక్ డ్యాంలు వాగులు వంకలు నిండి పొంగిపొర్లాయి.



ధర్మవరం మండలంలోని పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి ప్రవాహం



తాడిమర్రి మండలం పులుట్ల కనుమ వద్ద రోడ్డుపైకి విరిగిపడిన కొండచరియలు



యల్లనూరు మండలంలో నీటమునిగిన పంట పొలాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 'లోటస్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి హిందూపురం

కర్నాటక రాష్ట్రం గౌరీబిదనూర్ లో ఆదివారం జరిగిన 7 వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీలు జపాన్ కరాటే షోటో కాన్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలలో పట్టణ సమీపంలోని కొట్నూరు లోటస్ పబ్లిక్ స్కూల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బాలుర విభాగంలో యుగేష్, లిఖిత్, అనూష్, సుశాంత్ బాలికల విభాగంలో జీవిత, మేఘన, తన్విత రెడ్డి, లీలాశ్రీ బంగారు పతకం, కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభా విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు నీలకంఠారెడ్డి, ప్రిన్సిపల్ సూర్య నారాయణ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ముగిసిన ఉచిత యోగా శిక్షణ

ప్రజాశక్తి హిందూపురం

పట్టణంలోని మేళాపురంలో గల అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వివేకానంద యోగథెరఫీ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన 30రోజులు ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ టీచర్ బద్రీనారాయణ మాట్లాడుతూ ఆహార నియమాలతో ఆరోగ్యం పొందవచ్చునని, యోగాసనాలు వేయడంతో ఒత్తిడి తగ్గించుకోవచ్చునని అన్నారు. అనంతరం యోగా శిక్షకులను సన్మానించారు. కార్యక్రమంలో కారే రమేష్, వెంకటేష్ బాబు, దేవాంగం శంకరప్ప, మహేంద్ర, వెంకటేష్, బాలాజీ, కుమార్, బాలాజీ, నరసింహారెడ్డి, యోగసాధకులు ప్రభాకర్, మంచాల రామకృష్ణ. లాయర్ నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడు మృతి

ప్రజాశక్తి హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో మూడవ డివిజన్ లో అప్కాస్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుడు శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రాము తదితరులు ఆదివారం మతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెడ్పి శ్రీనివాసులు మాట్లాడుతూ మతి చెందిన పారిశుధ్య కార్మికుడు శ్రీనివాసులు గత 25 సంవత్సరాలు నుండి మున్సిపాలిటీ ప్రజలకు ఎంతో సేవ చేసినారు అన్నారు. ఇన్ని సంవత్సరాలు పొరపాలక సంఘంలో సేవలు అందించిన కార్మికుని కుటుంబానికి ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించకపోవడం శోచనీయమన్నారు. కనీసం కార్మికుని మట్టి ఖర్చులకు సైతం నయా పైసా విదల్చని దౌర్భాగ్య స్థితిలో మున్సిపాలిటీ ఉండడం దురదష్టకరం అన్నారు.కార్మిలను కేవలం బానిసలుగా ఉపయోగించుకొని శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున జగదీష్ కోశాధికారి ఆనందు యూనియన్ నాయకులు రామచంద్ర, చంద్ర, ప్రభు, నరసింహ, మూర్తి, శంకర్, బాబయ్య, మేస్త్రి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభలు

జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

ప్రజాశక్తి-గోరంట్ల

పెనుకొండ పట్టణంలో ఈ నెల 30, 31 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ తెలిపారు. స్థానిక మాధవరాయుని ఆలయం వద్ద ఆదివారం ఆటో, భవన నిర్మాణం, కార్పెంటర్స్, అంగన్వాడీ, గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులతో భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు అధ్యక్షత న సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, కోశాధికారి సాంబశివ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించాయన్నారు. వారి హక్కులు, చట్టాలను కాలరాస్తూ నిర్బంధాలు, పనిఒత్తిడితో కార్మికులను బానిసలుగా తయారు చేసే విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఏకమై పోరా డాలని పిలుపునిచ్చారు. అలాగే సిఐటియు జిల్లా మహాసభల్లో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేసి కార్మికుల సత్తా చాటాలని కోరారు. భవిష్యత్తులో మండలంలో కార్మికుల సమస్యలపై స్పందిస్తూ సిఐటియును విస్తరించుకోవాలని సూచించారు. అనంతరం సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారను. మండల కన్వీనర్‌గా నాగరాజు, 15 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ప్రభుత్వ పథకాలను చేనేతలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి బి. రామకృష్ణ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందాలని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి బి. రామకృష్ణ తెలిపారు. జిల్లాలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. వారి అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నాయి. అయినప్పటికీ ఆ వృత్తిలో ఉన్న వారు కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముడి సరుకు ధరలు పెరగడం, తాము నేసిన బట్టకు తగిన గిట్టుబాటు ధర రాకపోవడం, బయట అధిక వడ్డీలకు రుణాలు పొంది వాటి నుంచి బయటపడలేక ఆత్మహత్యకు పాల్పడడం లాంటి సంఘటనలు చూస్తూనే ఉన్నాము. ఇటీవలనే ధర్మవరంలో చేనేత కార్మికుడు అధిక వడ్డీ చెల్లించలేక పోవడంతో వడ్డీ వ్యాపారి తన అనుచరులతో ఆ కుటుంబం పై దాడి చేసిన విషయం తెలిసిందే. శ్రీ సత్య సాయి జిల్లాలో అధికంగా చేనేతలు ధర్మవరం, సోమందేపల్లి, హిందూపురం, పుట్టపర్తి తదితర ప్రాంతాలలో మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ధర్మవరం చేనేత వస్త్రాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. ఇటీవలనే ఒక జిల్లా ఒక ఉత్పత్తిపై సత్యసాయి జిల్లా ఎంపిక కాగా మంత్రి సవితమ్మ, కలెక్టర్ టిఎస్ చేతన్ ఢిల్లీలో అవార్డును అందుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో చేనేతల స్థితి గతులు, వారికి అందిస్తున్న పథకాలు తదితర అంశాలపై జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి బి. రామకృష్ణ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న : జిల్లాలో ఎంతమంది చేనేత కార్మికులు ఉన్నారు? అన్ని మగ్గాలు ఉన్నాయి?

జవాబు : జిల్లాలో వ్యవసాయం తర్వాత ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమ ద్వితీయ స్థానంలో ఉంది. దీనిపైనే ఆధారపడి జిల్లాలో 33, 274 మంది కార్మికులు ఉన్నారు. 28,500 చేనేత మగ్గాలు ఉన్నాయి. ఎక్కువగా ధర్మవరం, సోమందేపల్లి, హిందూపురం దగ్గర ముదిరెడ్డిపల్లి, పుట్టపర్తి తదితర ప్రాంతాల్లో చేనేత మగ్గాలు ఉన్నాయి.

ప్ర : చేనేతలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించండి?

జ : చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి చేనేత ముద్ర పథకం ద్వారా బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పించడం జరుగుతుంది. రూ.50 వేల నుంచి 2 లక్షల రూపాయల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుంది. ఇందులో 20 శాతం వరకు సబ్సిడీ ఉంటుంది. 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో రుణాలు మంజూరు కొరకు జిల్లాలో 75 మంది నుంచి దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 15 మంది చేనేత కార్మికులకు 16 లక్షల రూపాయలు రుణం అందించడం జరిగింది. మిగిలినవారికి త్వరలో మంజూరు కానున్నాయి. అంతేగాక 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద 12,712 మందికి పింఛన్లు మంజూరు కాగా ప్రతినెల ఒక్కొక్కరికి రూ. 4 వేలు పింఛను అందించడం జరుగుతుంది.



ప్ర : చేనేతల నైపుణ్య అభివృద్ధికి ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

జ : సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న దశలో చేనేతలకు మరింత నైపుణ్యం పెంపొందించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. హిందూపురంలో తెలుగు చేనేత పరిశ్రమ శిక్షణ కేంద్రంలో 30 మంది చేనేతలకు జాకార్డు వీలింగ్‌లో శిక్షణ ఇవ్వబడింది. 60 మంది మహిళలకు నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇప్పించి కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరిగింది. అలాగే సోమందేపల్లికి చెందిన 30 మంది కార్మికులకు విజయవాడ వీలింగ్ సెంటర్ నందు శిక్షణ ఇవ్వడం జరిగింది.

ప్ర : చేనేత క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించండి?

జ: సోమందేపల్లిలో రూ. 116.62 లక్షలతో 164 మంది చేనేత కార్మికులకు క్లస్టర్ ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే హిందూపురం చేనేత క్లస్టర్ మంజూరు అయింది. నిధుల విడుదల కాగానే ఆ క్లస్టర్ ద్వారా కార్మికులు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది. ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ కొరకు రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగింది. అలాగే రెండు చిన్న క్లస్టర్లు క్రింద సి.కె. పల్లి, నల్లచెరువులో ఏర్పాటుకు కార్మికులకు పనిముట్లు వర్క్ షెడ్లు కొరకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. అలాగే డి సి హెచ్ ఎన్ హెచ్ డిపి క్రింద గోరంట్ల, పెనుకొండ, పరిగి, రొద్దం, సోమందేపల్లి లో ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగింది.

ప్ర: చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం ఎప్పటి నుంచి అమలు అవుతుంది?

జ : ఈనెల 7న చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు ఉచిత విద్యుత్ ఆ రోజు నుంచి అమలు అవుతుంది. అందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది. చేనేతలకు 200 యూనిట్లు మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్తును పొందనున్నారు. జిల్లాలో 7,177 చేనేత కుటుంబాలు 2001 పవర్ లూమ్స్‌కు ఈ ఉచిత విద్యుత్ లబ్ధి చేకూరనుంది.



జిల్లా చేనేత, జౌలిశాఖ అధికారి బి. రామకృష్ణ

ప్ర: ఇటీవల జిల్లాకు అవార్డు రావడం గురించి తెలపండి?

జ : ధర్మవరం పట్టుచీరలకు ఈ గౌరవం దక్కింది. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కార్యక్రమం క్రింద అవార్డు రావడం జరిగింది. ప్రతిష్టాత్మక ఈ అవార్డును న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతులు మీదుగా రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌలి శాఖ మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఇటీవల ఈ అవార్డు అనుకున్నారు. ఇది మన జిల్లాకు దక్కిన గౌరవంగా భావించవచ్చు.

ప్ర : చేనేతలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

జ : ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలి. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో మరిన్ని శిక్షణనలు పొంది నైపుణ్యం పెంపొందించుకోవాలి. బయట అధిక వడ్డీలకు రుణాలు తీసుకోరాదని కోరుతున్నాం.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో నాయకుల పిలుపు

ప్రజాశక్తి-పెనుకొండటౌన్

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని మౌర్య రెసిడెన్సీ వద్ద ఆదివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పెనుకొండ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్ హాజరయ్యారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే యుటిఎఫ్ ధ్యేయమని, అందుకోసం అహర్నిశలు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. అవసరమైతే ఇతర ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఉద్యమాలు చేపడుతామన్నారు. సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాల చర్యలు విద్యారంగాన్ని పరిరక్షించే దిశగా ఉండాలన్నారు. విద్యా రంగాన్ని ప్రయోగశాలగా చూడకూడదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యా విధానాలు మార్చ కూడదన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ శివయ్య, జిల్లా కార్యదర్శులు ఈ.నారాయణస్వామి, జిసి.నరేష్‌కుమార్, జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ హసీనాబేగం, నాయకులు నబీ, రమేష్, రవీంద్రనాథ్, గంగాధర్, మారుతి, రమేష్, రామాంజనేయులు, నరసింహులు, గౌరమ్మ, నాగమణి, వెంకటనాయక్, అమరనారాయణరెడ్డి, లక్ష్మయ్య, అమర్నాథ్‌రెడ్డి, కృష్ణతేజ పాల్గొన్నారు.


ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కదిరి టౌన్ : స్థానిక ఎంఆర్‌సి ప్రాంగణంలో యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడు మధుసూదన్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శులు తాహెర్ వలి, సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు గౌస్ ఖాన్ హాజరయ్యారు. జెండా గీతం రమేష్,సుధాకర్ ,సంతోష్, బ్రహ్మేంద్ర ఆలపించారు. జిల్లా ఆడిట్ సభ్యులు మల్లికార్జున వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్ ఖాన్, సుధాకర్, వెంకట సుబ్బయ్య, అయూబ్ బాషా,నారాయణ సునీల్ కుమార్,రమణ నాయక్, రవివర్ధన్ రెడ్డి, నజీర్, నాగరాజు, గణేష్, ఖాజా, ఖాదర్ భాషా,షరీఫ్ , చాంద్ బాషా , కిషోర్,ప్రసాద్, బాబాజాన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ధర్మవరం జోన్ నాయకులు యుటిఎఫ్ పతకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్ 51 ఏళ్లుగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హనుమంతరావు, లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, హెచ్.రామాంజనేయులు, సకల చంద్రశేఖర్, ఆంజనేయులు, సురేష్, అమర్నాథ్‌రెడ్డి, కృష్ణతేజ, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న ప్రాథమికోనత పాఠశాలలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఎన్.మహలింగప్ప, వై.జోగప్ప ఆధ్వర్యంలో యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యుటిఎఫ్ 51 ఏళ్లుగా పోరాడుతోందన్నారు. హిందూపురం రోడ్డులోని శ్రీసత్యసాయి శల్యచికిత్స కేంద్రంలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. అక్కడ ఉచిత సేవలు అందిస్తున్న బాషానాయక్, రంగమ్మ దంపతులు, వారికి సహకరిస్తున్న అంజనప్పను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు ఈ.నరసింహమూర్తి, నాయకులు టి.మూడ్ల గిరియప్ప, మహంతేష్, యల్లప్ప, కెటి.హనుమంత రాయప్ప, నంజప్ప, సూర్యప్రకాష్, ఎం.రామంజప్ప పాల్గొన్నారు.


పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెడ్లు పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

చిలమత్తూరు : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులు లక్ష్మీనరసింహప్ప యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భావం నుంచి నేటి వరకూ హక్కులు, బాధ్యతలను రెండు కళ్లుగా భావించి, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతి, ట్రెజరర్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు నంజప్ప, సురేష్, అలీముల్లా, సురేష్, అపర్ణ, సరిత, తదితరులు పాల్గొన్నారు.


చిలమత్తూరులో యుటిఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పుట్టపర్తిలో నిరుపయోగంగా మరుగుదొడ్లు..!

పర్యవేక్షణ కరువై మూతపడిన వైనం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో సుమారు పదేళ్ల క్రితం ప్రజల సౌకర్యార్థం ఆరు ప్రదేశాల్లో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో స్వచ్ఛ ఆంధ్ర పథకం కింద చిత్రావతి వంతెన, ఆర్టీసీ డిపో, ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎస్‌బిఐ, మున్సిపాలిటీ కార్యాలయం, సూపర్ స్పెషాలిటీ ప్రాంతాల్లో మరుగుదొడ్లు నిర్మించారు. ఎస్‌బిఐ, మున్సిపాలిటీ సమీపంలోని వారపు సంత జరిగే ప్రాంతంలో నిర్మించిన మరుగు దొడ్లను రహదారి విస్తరణలో భాగంగా తొలగించారు. మిగిలిన ప్రాంతాల్లో ఉన్న మరుగుదొడ్లు నిత్యం తలుపులు మూసి తాళాలు వేసి ఉండడం కనిపిస్తుంది. శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకల సమయంలో మాత్రమే అధికా రులు వాటిని తెరిపిస్తున్నారు. ఆ సమయంలో ప్రయాణికులు, భక్తుల రద్దీగా ఉండటంతో నవంబర్ నెలలో మాత్రమే ఆ మరుగుదొడ్లు పనిచేస్తాయి. ఆ తర్వాత మూసి వేస్తున్నారు. పర్యవేక్షించే వారు లేకపోవడమే వాటిని మూసి వేయడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రాథమిక ఆరో గ్య కేంద్రానికి వచ్చే రోగులు, చిత్రావతి నది వంతెన వద్ద ప్రయాణికులు మల మూత్రాలు విసర్జించాలం టే పలు అవస్థలు పడుతు న్నారు. బస్సు డిపో దగ్గర కూడా రద్దీగా ఉంటుంది. కనీసం ఇక్కడ ఉన్న వాటినైనా నిత్యం అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



పుట్టపర్తిలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ఎన్నికల హామీలు ఏమయ్యాయి..? : వైసిపి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి, గుడిపల్లి, వెలదడకల, తుంగోడు, కావేటినాగేపల్లి గ్రామ పంచా యతీల్లో ఆదివారం వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా మాజీమంత్రి, పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హాజరై స్థానిక పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిం చారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో కేవలం అధికారం కోసం మోసపూరిత హామీలు ఇచ్చార న్నారు. అధికారం చేపట్టాక సూపర్‌సిక్స్‌తో పాటు ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర, స్మార్ట్ మీటర్ల తొలగింపు ఎక్కడని నిలదీశారు. అన్నదాత సుఖీభవ నిధులు ఇప్పటికీ రైతులు ఖాతాల్లో జమ కాలేదన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు రీ కాల్ చేయాలని కోరారు. అలాగే చంద్రబాబు మోసాలపై వైసిపి రూపొందిం చిన క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను, చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, వైసిపి బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.


వైసిపి రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న ఉషశ్రీచరణ్

కార్యక్రమంలో మండల కన్వీనర్ గజేంద్ర, టౌన్ కన్వీనర్ గోవిందమ్మ గారి శ్రీనివాసులు, జడ్పిటిసి డిసి.అశోక్, మేజర్ పంచాయతీ ఉపసర్పంచి వేణు, సర్పంచులు రామాంజనే యులు, లక్ష్మీనరసప్ప, జిలాన్‌ఖాన్, నాయకులు నారాయణరెడ్డి, కళ్యాణ్, సూర్యప్రతాప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : మండలంలోని తంగేడుగుంట పంచాయతీలో వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎమయ్యాయని మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, సర్పంచి హబిదాబాను, ఎంపీటీసీ రమణ ప్రశ్నిం చారు. గడప గడపకూ వెళ్లి చంద్రబాబు ఎంత బకాయి పడ్డారో లెక్కలు వేసి మరీ వివరించారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ రఫిక్, చింతా వెంకటేష్, శెట్టి వారి రమేష్, నరసింహారెడ్డి, అశ్వత్థరెడ్డి ఫర్టిలైజర్ కృష్ణారెడ్డి, బాబు, కిష్టప్ప, వెంకటరమణ, వీరప్ప, మహిళలు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల అండతోనే భూకబ్జాలు..!

రైతు సంఘం నాయకులు సూర్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలో భూకబ్జాదారులు పెట్రేగిపోతున్నారని, రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నాయ కుల అండదండలతో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటు న్నారని రైతు సంఘం నాయకులు బి.సూర్యనారాయణ రెడ్డి ఆరోపించారు. మండలంలోని వంకమద్ది క్రాస్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని గతంలో సిపిఐ ఆధ్వర్యంలో అప్పటి తహశీల్దార్ నరేంద్రకుమార్, ప్రస్తుత తహశీల్దార్ దేవేంద్రనాయక్‌లకు పలుమార్లు వినతి పత్రాలు అందజేయగా ఆ భూమిని పేదలకే కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఈ మధ్య కాలంలో కొందరు భూ బకాసురులు ఆ స్థలంపై కన్నేసి కొందరు రెవెన్యూ అధికారులు, నాయ కుల కనుసన్నల్లో గుట్టుచప్పుడు కాకుండా సెంటు రూ. 50 నుంచి రూ. 70 వేల చొప్పున అమ్ముకుంటున్నారని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కూడా చెరువు, వంక, పోరంబోకు, గ్రామకంఠం భూములు కబ్జాకు గురయ్యాయని, ప్రభుత్వ భూములను కాపాడాలని పలుమార్లు అర్జీలు ఇచ్చినా కనీసం ఆ భూములను సర్వే చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఎన్‌పి.కుంట పెద్దచెరువు, దేవరచెరువులు కొన్నేళ్లుగా కబ్జాకు గురై పెత్తందారుల కబంధ హస్తాల్లోకి చేరినా రెవెన్యూ అధికారుల్లో చలనం లేదన్నారు. ఇకనైనా కలెక్టర్ చొరవ చూపి ప్రభుత్వ భూములను సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి రక్షించాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.



శ్మశానవాటికకు స్థలం కేటాయించండి : వ్యకాసం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని మామిళ్లకుంట క్రాస్ ఎస్సీ కాలనీలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. మామిళ్లకుంట క్రాస్ ఎస్సీ కాలనీలో ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియలు చేయడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీవాసులు వ్యకాసం నాయకుల దృష్టికి తెచ్చారు. స్పందించిన వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటేష్, మహిళా నాయకురాలు రమాదేవి ఆదివారం కాలనీలో పర్యటించి స్థానికులతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ కొత్తచెరువు మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్లకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. గత శనివారం మామిళ్లకుంట క్రాస్‌కు చెందిన చెన్నమ్మ మృతి చెందగా స్థలం లేక అంత్యక్రియలు చేసేందుకు ఇబ్బందులు పడ్డారన్నారు. చివరకు వంక పోరంబోకు స్థలంలో పూడ్చగా భారీ వర్షానికి మృతదేహం బయటపడి వాగులో కొట్టుకుపోతూ ఉంటే మృతదేహాన్ని మళ్లీ తీసుకొచ్చి జెసిబితో లోతుగా గుంత తీసి పూడ్చారని తెలిపారు.

ఇకనైనా అధికారులు స్పందించి మామిళ్లకుంట క్రాస్‌లో శ్మశానవాటికకు 3 ఎకరాల స్థలం కేటాయించాలని, లేనిచో ప్రజా సంఘాలతో కలిసి కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : పల్లె

ప్రజాశక్తి-బుక్కపట్నం

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గూనిపల్లి సింగిల్‌విండో అధ్యక్షులుగా ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లె మాట్లాడుతూ సిఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 46 లక్షల రైతు కుటుంబాలకు సుమారు రూ. 10వేల కోట్లు ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. అలాగే అనేక పథకాలు అమలు చేస్తూ రైతుల అభ్యున్నతికి పాటుపడుతుందని తెలిపారు. సహకార సంఘాల ద్వారా విరివిగా రుణాలు మంజూరు చేసి రైతులను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం గూనిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షులుగా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులుగా శ్రీరాములు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు గంగాధర్, అప్పస్వామి, వెంకటనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకట రాముడు, కృష్ణమూర్తి, అశోక్‌కుమార్‌రెడ్డి, నాగిరెడ్డి, కేశవయ్య, తదితరులు పాల్గొన్నారు.


గూనిపల్లి సింగిల్‌విండో అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి


చాలకూరు సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి



సోమందేపల్లి : మండలంలోని చాలకూరు సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా తనను నియమించినట్లు కొలింపల్లి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే డైరెక్టర్లుగా కె.చిన్నంజ నప్ప, సంజీవప్పలను నియమించారన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు పార్టీ అధిష్టానంతో పాటు మంత్రి సవితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దీనిని పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తూ నా పరిధిలోని రైతులందరికీ అందుబాటులో ఉంటూ రైతుల అభివృద్ధికి తోడ్పాటుగా ఉంటానన్నారు. ఈ పదవి రావడానికి కారణమైన మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

రొద్దం- వీరాంజనేయులు, కలిపి-రామచంద్ర

రొద్దం : రొద్దం సింగిల్‌విండో అధ్యక్షునిగా వీరాంజనేయులు, కలిపి సొసైటీ అధ్యక్షునిగా దొడగడ్డ గ్రామానికి చెందిన రామచంద్రను నియమిం చారు. దీంతో వారికి ఆయా గ్రామాల ప్రజలు అభినందనలు తెలిపారు.


కలిపి - రామచంద్ర
రొద్దం- వీరాంజనేయులు

పేదలకు కంటి చూపు ప్రసాదించడమే రోటరీ క్లబ్ లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పేద ప్రజలకు కంటి చూపు ప్రసాదించడమే రోటరీ క్లబ్ లక్ష్యమని క్లబ్ అధ్యక్షులు నాగభూషణ, కోశాధికారి నరేందర్ రెడ్డి, కార్యదర్శి విజయభాస్కర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి–బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. దాసరి పెద్ద వెంకటేశులు, కేశమ్మ జ్ఞాపకార్థం వారి కోడలు, కుమారుడు రమాదేవి, డివి.వెంకటేశులు(చిట్టి) దాతలు, క్యాంపు ఛైర్మన్‌గా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ గా వ్యవహరించారన్నారు. శిబిరానికి 135 మంది రాగా డాక్టర్ మాన్సి వైద్య సేవలందించి 105 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్లు, వారికి బెంగుళూరులోని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేసి అద్దాలు ఇస్తామని తెలిపారు. అనంతరం దాతలు, డాక్టర్ మాన్సి, ఆసుపత్రి మేనేజర్ శివప్రకాష్‌లను రోటరీ క్లబ్ వారు సత్కరించారు. కార్యక్రమంలో సత్రశాల ప్రసన్నకుమార్, సుదర్శన్‌గుప్తా, రత్నశేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు, రామకృష్ణ, కొండయ్య, డాక్టర్ సంకారపు నరసింహులు, కృష్ణమూర్తి, జయసింహ, బండారు వెంకటాచలం, గట్టు హరినాథ్, డాక్టర్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

'విజన్ ప్లస్' కంటి ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-కదిరిటౌన్

పట్టణంలోని బైపాస్ రోడ్డులో అన్ని అధునాతన హంగులతో విజన్ ప్లస్ కంటి ఆసుపత్రిని నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ ఆసుపత్రిని ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కంది కుంట వెంకటప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను, అధునాతన పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పివి.పవన్‌కుమార్‌రెడ్డి, ఆసుపత్రి యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.


విజన్ ప్లస్ కంటి ఆసుపత్రిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ఎపియుఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-బత్తలపల్లి



ఒంగోలు పట్టణంలో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఎపియుఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తనను రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు. బత్తలపల్లిలోని బాలికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న రాజేంద్ర ప్రసాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా పని చేస్తూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాడారు. రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్న అతడిని రాష్ట్ర ఉపాధ్యక్షు లుగా నియమించారు. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం, ఎపియుఎస్ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. రాజేంద్ర ప్రసాద్‌కు ఉమ్మడి జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమరచంద్రబాబు, సురేష్‌బాబు, కళ్యాణి, ఎర్రిస్వామి, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఖాద్రీశుని ఆలయ పాలక మండలి నియామకానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి నియామకానికి ఆదివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 8 నుంచి 27వ తేదీ లోపు దరఖాస్తులను ఆలయ ఈవో కార్యాలయంలో అందజేయాలని ఉప కమిషనర్ వెండి దండి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వివరాలకు దేవస్థానం కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలన్నారు. లేదా ఫోన్ నెం : 08494-221066, 221366, 9491000739 సంప్రదించాలన్నారు.

'పాంచజన్య పాఠశాల సిబ్బంది కుటుంబంతో సమానం'

ప్రజాశక్తి హిందూపురం

'నాకు ఇద్దరు బిడ్డలు ఉన్నారు.. ఆ ఇద్దరే కాదు పాఠశాలలో పనిచేసే అందరూ నా సొంత బిడ్డలే' అని పాంచజన్య పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అన్నారు. వరలక్ష్మి పండుగను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు, భారతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయునులకు, మహిళా సిబ్బందికి గౌరవించారు. ఇంటి ఆడబిడ్డల మాదిరి భావించి ఒడిబియ్యం పెట్టి, పట్టు చీరలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ తన కుటుంబ సభ్యులే అన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అందరూ పాఠశాలను వారి సొంత ఇల్లుల భావించి, విద్యార్థులను వారి సొంత బిడ్డల్లా చూస్తూ, విద్యతో పాటు వారికి సమాజం గురించి వివరిస్తున్నారన్నారు. దీంతో మంచి ఫలితాలతో పాటు తమ పాఠశాల విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకున్న ఆ రంగంలో రాణిస్తున్నారని అన్నారు. అనంతరం అందరినీ భారతి శ్రీనివాసులు, కరస్పాండెంట్, సెక్రటరీ డి.ఎస్ నందకుమార్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్లు స్మిత, నందిత, ఏఓ భాస్కర్, పాఠశాల సూపరిటెండెంట్ విజయేంద్ర, ఏ హెచ్ ఎం లు శశికళ, అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్ తో పాటు సిబ్బంది, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.


పాఠశాల మహిళా సిబ్బందితో పాంచజన్య శ్రీనివాసులు, తదితరులు

దళితులపై వైసిపి మూకల దాడి హేయం

ప్రజాశక్తి-కదిరిటౌన్

తిరుపతిలో దళితులపై వైసిపి మూకల దాడి అమానుషమని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు. తిరుపతిలో వైసిపి మాజీ ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి అనుచరులు దళిత యువకుడు పవన్‌పై విచక్షణా రహితంగా దాడులకు పాల్పడడంపై దళిత సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి పాలనలో 365మంది దళితులపై అత్యాచారాలు, హత్యలు, దాడులు జరిగాయ్నఇ మండిపడ్డారు. వైసిపి అధినేత, అప్పటి సిఎం జగన్ దళితులపై దాడులను నియంత్రించకపోగా ప్రోత్సహించడంతో పాటు దాడులకు పాల్పడిన వారిని వెనకేసు కొచ్చారని ధ్వజమెత్తారు. పెత్తందారులుగా వ్యవహరిస్తున్న వైసిపి నేత భూమ కరుణాకర్‌రెడ్డి, దాడులకు పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాలపై దాడులకు పాల్పడుతున్న వారిని జగన్ వెనుకేసుకు రావడం దౌర్భాగ్యం అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శంకరగల్లులో అధ్వానంగా సీసీ రోడ్లు

ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని శంకరగల్లు గ్రామంలో రోడ్లు అధ్వాన స్థితికి చేరాయి. ముఖ్యంగా సీసీ రోడ్లన్నీ కంకర లేచిపోయి గుంతలమయం కావడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బంద లు పడుతున్నారు. కనీసం కాలి నడకన వెళ్లేందుకు కూడా సాధ్యం కావడం లేదని మహిళలు వాపోతు న్నారు. గ్రామంలో సుమారు 20 ఏళ్ల క్రితం స్థానిక బస్టాండ్ నుంచి ఎస్సీ కాలనీ వరకూ సీసీ రోడ్డు నిర్మించారు. గ్రామంలోని ప్రధాన రహదారి అయిన బస్టాండ్‌లోని శ్రీబసవేశ్వర స్వామి ఆలయం నుంచి ఇందిరమ్మ కాలనీ వరకూ సీసీ రోడ్డు గుంతలమయమైంది. చిన్నపాటి వర్షం కురిసినా ఆ గుంతల్లో నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలైన సంఘటనలు ఉన్నాయి. కొత్తగా సీసీ రోడ్లు వేయాలని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. శంకరగల్లు గ్రామం మండలంలోని అత్యధిక జనాభా కలిగిన గ్రామం. ఇలాంటి గ్రామంలో రోడ్లు అత్యంత అధ్వానంగా తయారైనా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని లేదా నూతనంగా సీసీ రోడ్లు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.




శంకరగల్లులో అధ్వానంగా మారిన రహదారులు

అట్టహాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-పరిగి

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 2007-08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలిశారు. సుమారు 17 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులను ఒక చోట కలవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరిం చుకున్నారు. యోగ క్షేమాలు అడిగి తెలుసు కున్నారు. ఆనాటి మధు జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాభ్యాసం అందించిన ఉపాధ్యాయులను సన్మానించారు. వారితో అనుభవాలను పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సుమారు 120 సంతోషం గా గడిపారు. పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు సాయం చేస్తామని, రానున్న రోజుల్లో పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు చేయూతనిస్తామని వారు హామీ ఇచ్చారు.


పరిగి జడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన 2007-08 బ్యాచ్ విద్యార్థులు

నూతన బస్సు సర్వీసు ప్రారంభం

మడకశిర : ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆదేశాల మేరకు ఆదివారం రొళ్ల మండలంలోని గుడ్డగుర్కి గ్రామం మీదుగా నూతనంగా ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ రంగ భాష్యం తెలిపారు. గుడ్డుగుర్కి గ్రామ పరిసర ప్రాంత ప్రజల వినతుల మేరకు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చొరవతో ఏర్పాటు చేసిన ఈ బస్సు ఉదయం 10 గంటలకు మడకశిర నుంచి బయల్దేరుతుంది. చంద్రబావి, మిడిగేసి, గుడ్డగుర్కి, రత్నగిరి, కాకి, బ్యాడిగెర మీదుగా కైమర చేరుకొని తిరిగి అదే మార్గంలో నుంచి వస్తూ హిందూపురం వెళ్తుందన్నారు. గుడ్డగుర్కి పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

పుట్టపర్తి అర్బన్ : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' యధావిధిగా జరుగుతుందని ఆదివారం కలెక్టరేట్ నుంచి ఓ ప్రకటన వెలువడింది. గ్రీవెన్స్‌లో జిల్లా అధికారులందరూ పాల్గొని ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. అలాగే డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా గ్రీవెన్స్ నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధాప్య పింఛను మంజూరు చేయరూ..!

పుట్టపర్తి క్రైమ్ : వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లికి 62 ఏళ్ల చాకలి దాదులూరప్ప మొరపెట్టుకుంటున్నాడు. భార్య 20 ఏళ్ల క్రితమే మృతి చెందిందని, ముగ్గురు కుమారులు ఉన్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పక్షవాతం వచ్చి కుడి చెయ్యి, కుడి కాలు పని చేయడం లేదని, నోరు సొట్ట బోయి మాట్లాడలేని స్థితిలో ఉన్నానని వాపోయాడు. ఉండడానికి ఇల్లు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ షెడ్‌లో నివసిస్తున్నానని తెలిపాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని వేడుకున్నాడు.


చాకలి దాదులూరప్ప

నాటు సారా స్వాధీనం.. కేసు నమోదు

కదిరి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల గ్రామంలో చెరువుకట్ట వీధికి చెందిన వనం మునెప్ప అక్రమంగా నాటుసారా విక్రయిస్తుండగా ఆదివారం పోలీసులు దాడి చేసి నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే అతడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.